
# అమ్మాయే సన్నగా

**- వసుంధర**

ఆమె సన్నగా నాజూగ్గా ఉంటుంది. అందుక్కారణం ఆమె పాటించే ఆరోగ్య సూత్రాలే తప్ప సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా వారానికి ఏడురోజులూ, రోజుకి పన్నెండు గంటలూ ఆఫీసు పనిమీదుండడం కాదు. ఆమె ఎవరినెదిరించడానికీ భయపడదు. అందుక్కారణం ఆత్మాభిమానమే తప్ప నెల జీతం అర లక్ష దాటిందన్న పొగరు కాదు. ఆమె పేరు కవిత. చూపులకు అందమైన కవితలా ఉండడం అందుక్కారణమనలేం. ఎందుకంటే పేరు పెట్టేటప్పుడు తలిదండ్రులకామె భావి గురించిన దూరదృష్టి ఉన్నదనిపించదు.

చిన్నప్పట్నించీ ఆమె తలిదండ్రుల దూరదృష్టి అంతా పెద్ద కొడుకు రవి మీదనే కేంద్రీకరించబడింది. అతణ్ణి డాక్టరో, ఇంజనీరో చేయాలని ఎల్కేజీ నుంచే ఇంగ్లీష్ మీడియం స్కూల్లో చేర్చారు. ఎనిమిదవ తరగతి నుంచి కోచింగ్ సెంటర్సులో తోమించారు. ఎంసెట్లో మరీ అంత మంచి రాంక్ రాకపోతే కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో సీటుకోసం భారీ డొనేషన్ కట్టారు. వారి అదృష్టం బాగుండి రోజులు మారి- అతగాడు కాంపస్ సెలక్షన్లోనే ఓ మంచి కంపెనీలో ఉద్యోగం సంపాదించి రెండేళ్ళు తిరక్కుండా అమెరికా వెళ్ళి స్థిరపడ్డాడు.



కవిత రవికంటే ఆరేళ్ళు చిన్నది. ఆమె పుట్టేసరికి ఆడ పిల్లలందరూ ఇంజనీరింగ్ వైపు పరుగులెడుతున్నా తలిదండ్రులు మాత్రం కాలంతో పాటు ముందుకెళ్ళాలనుకోలేదు. అందుక్కారణం కవిత మేనమామ కొడుకు ఆహ్లాద్. అతడు కవిత కంటే ఐదేళ్ళు పెద్ద. కవిత పుట్టగానే ఆహ్లాద్‌కి పెళ్ళాం పుట్టిందన్నారు. ఆహ్లాద్ తలిదండ్రుల రుచులకు, అభిరుచులకు అనుగుణంగా ఆమెను పెంచాలని వారి సంకల్పం. ఆమెను తెలుగు మీడియం స్కూల్లో చేర్పించి సంప్రదాయ పద్ధతుల్లో పెంచారు. మధ్య మధ్య మేనమామ వచ్చి కవిత పెంపకాన్ని సమీక్షించి తగిన సూచనలిచ్చి వెడుతూండేవాడు.

కవిత ఇంటర్మీడియట్‌లో చేరాక ఆ ఇంటికి ఆహ్లాద్ రాకపోకలు పెరిగాయి. బీకాం ప్యాసై ఎంబీయేలో చేరిన అతడామెకు తన అభిరుచులను గొప్పగా చెప్పేవాడు. ఆమె అందాన్ని పొగిడేవాడే తప్ప ఆమె అభిరుచులేమిటని అడిగేవాడు కాదు. అతడి గురించి తెలుసుకుని అందుకనుగుణంగా తను మారాలన్నది అతడి ఉద్దేశ్యమని కవితకు అనిపించింది. ఆ మాట ఫిర్యాదులా తల్లికి చెబితే ఆమె ఆహ్లాద్ అంతర్యామిని ముచ్చటపడేది. తండ్రి కూడా తల్లికి వత్తాసేనని తెలిసేక- తను చాపకింద నీరులా వ్యవహరించాలని గుర్తించింది కవిత.

ఆహ్లాద్ ఆమెను బీకాం చదవమన్నాడు. ఇంజనీరింగ్ చదువుతానందామె. తన మాట వినకపోతే ఆమెను పెళ్ళి చేసుకోనని హెచ్చరించాడు ఆహ్లాద్. అతణ్ణి వదిలించుకుందుకు అదో మంచి అవకాశమనుకున్న కవిత పట్టుదలగా చదివి ఇంటర్మీడియేట్‌లో మంచి మార్కులు తెచ్చుకుంది. రాత్రింబవళ్లు కృషిచేసి ఏ కోచింగూ లేకుండానే- ఎంసెట్లో ఉమెన్స్ కోటాలో ఫ్రీ సీట్ వచ్చే రాంక్ తెచ్చుకుంది. అందుకామెకు లభించిన అభినందన పరంపరలు చూసేదాకా- ఆ రాంక్ తెచ్చుకోవడమెంత కష్టమో ఆమె తలిదండ్రులకు తెలియలేదు. కూతురి అభీష్టాన్ని కాదనడానికిబ్బంది పడిన తండ్రి, “మీ అన్నయ్యకెలా నచ్చజెబుతావో నీ ఇష్టం” అంటూ నెపం భార్యమీదకు నెట్టాడు. కవిత తల్లికి ఆ బాధ్యత తీసుకోవడం తప్పనిసరైంది. ఆమె కూతురు సాధించిన రాంక్ గొప్పతనం అన్నకు వివరించి- ఇప్పుడామెను ఇంజనీరింగ్ చదవద్దనడం న్యాయంకాదని మనవి చేసుకుంది. ఆ వినయానికి అహం తృప్తిపడగా- తన మేనకోడలు ఇంజనీరు కావడం తనకూ గర్వకారణమేనన్నాడాయన. ఐతే, “దాన్ని వేరే ఊళ్ళో హాస్టల్లో పెట్టకు. రోజూ ఇంటి దగ్గర్నుంచే కాలేజీకెళ్ళొచ్చే ఏర్పాటేదైనా చెయ్యి” అంటూ తెలివిగా ఓ షరతు పెట్టాడు. ఆమెకు సీటొచ్చిన కాలేజీ, తాముండే ఊరు- ఆ షరతుకి అనుగుణంగా లేకపోవడంతో- కవిత తలిదండ్రులు సందిగ్ధంలో పడ్డారు. అప్పుడు తప్పనిసరై కవిత ఇంట్లో పెద్ద రాద్ధాంతం చేసింది. దానికామె అన్నయ్య రవి కూడా మద్దతు పలుకుతూ, “ఇంజనీరింగ్ చదవడానికి అసలు ఇబ్బంది సీటు తెచ్చుకోవడమొక్కటే. తెచ్చుకున్న సీటొదులుకోవడం తెలివి తక్కువ” అన్నాడు.

కవిత తల్లికీ ఆ విషయం తెలుస్తోంది. ఆమె బాగా ఆలోచించి- ఇంజనీరింగ్ చదవడానికి ముందొద్దని తర్వాతొప్పుకున్న అన్నయ్య- హాస్టల్ విషయంలోనూ రాజీపడకపోడని సరిపెట్టుకుని- ఆయనకా విషయం తెలియబరుస్తూ ఓ కార్డువ్రాసి పడేసింది. తనతో సంప్రదించకుండానే తన చెల్లి ఆ నిర్ణయం తీసుకుందని గ్రహించిన ఆయన- మేనకోడలు తమ చేయి దాటిపోతుందని భయపడ్డాడు. ఆయన ఆఘమేఘాల మీద కవిత ఇంటికొచ్చి- “ఏదో మాటవరసకన్నాను కానీ ఇంజనీరింగ్ చదవాలన్నాక అవసరమైతే హాస్టల్లోనూ చేరాలి. అంతమాత్రానికి మొదట్నించీ అనుకున్న సంబంధం కాదనుకుంటామా?”అంటూ అడక్కపోయినా చెల్లెలికి హామీఇచ్చాడు. ఐతే మగ పిల్లాడి తండ్రిగా తన హోదా పడిపోకూడదని- ఇంజనీరయ్యేక ఆమె ఉద్యోగం చేయకూడదని కొత్త షరతు పెట్టాడు. ఆయన షరతులకొప్పుకోవడంలో ప్రమాదం లేదని గ్రహించిన కవిత తలిదండ్రులు సరేనన్నారు. ఆమెను కాలేజిలో చేర్పించడానికి మేనమామ కూడా వెళ్ళాడు. అలా కవిత ఇంజనీరింగ్ కాలేజిలో చేరే సమయానికి ఆహ్లాద్ ఢిల్లీలో ఓ ప్రైవేట్ బ్యాంకులో మంచి ఉద్యోగంలో చేరాడు.

ఇట్టే నాలుగేళ్ళు గడిచి కవిత ఇంజనీరైంది. ఆమెకు కాంపస్ ఇంటర్వ్యూలో మంచి కంపెనీలో మంచి ఆఫర్ వచ్చిందని తెలిసిన మేనమామ- ఆమె ఉద్యోగంలో చేరడానికి ససేమిరా అన్నాడు. అందుకామె తలిదండ్రులూ తందాన తాన అంటూ- పెళ్ళయ్యేదాకా ఆగి భర్త ఒప్పుకుంటే అప్పుడు ఉద్యోగం గురించి ఆలోచించమని కవితకు చెప్పారు.

అప్పుడు కవిత ఏమాత్రం ఆవేశపడకుండా, “నా జీవితం నాది. నేను ఉద్యోగంలో చేరడానికి ఒకరి అనుమతి అవసరంలేదు” అంది నెమ్మదిగా. ఆమె హైదరాబాదులో ఉద్యోగంలో చేరడానికి బయల్దేరితే- పెళ్ళయ్యేక భర్త సంగతటుంచి పెళ్ళికిముందే తలిదండ్రుల మాట లెక్కచేయని స్థాయికామె చేరుకున్నదని గ్రహించిన తల్లి- విషయం తన అన్న కుటుంబానికి చేరవేసి అసహాయతను వ్యక్తపరిచింది. మేనల్లుడు తనకు అల్లుడయ్యే ఆశనిక వదులుకుందామె.

రెండేళ్ళలోనే కవిత ఉద్యోగంలో బాగా నిలదొక్కుకుంది. జీతం బాగా పెరగడమే కాక, విదేశీ అవకాశాలూ వెంటబడుతున్నాయి. పెళ్ళికాకుండా దేశం విడిచిపెడితే తలిదండ్రులు మరీ నొచ్చుకుంటారని తెలిసి ఏంచేయాలా అని ఆలోచిస్తోందామె. ఆహ్లాద్‌ని పక్కనపెట్టినా పెళ్ళి ఆమెకు సమస్యేంకాదు. ఇప్పటికే ఆమెను పెళ్ళాడాలనుకుంటున్న యువకులు కొందరున్నారు. కవిత వాళ్ళ బయోడేటాలను తనదైన పద్ధతిలో విశ్లేషించుకుంది. వారిలో బాగా నచ్చిన రమేష్‌కి- తనకంటే తన సంపాదన మీదే ఆసక్తి ఎక్కువ అనిపించింది. అది తేల్చుకుందుకామె అతణ్ణి ఈట్ స్ట్రీట్‌లో కలుసుకుని, ‘పెళ్ళయ్యేక నీ జీతం మనది. నా జీతంలో ప్రతిపైసా నా తలిదండ్రులది. నీకు ఓకేయేనా?” అనడిగింది.

రమేష్ అందుకు సరేనని, “నీకులాగే నాకూ నా తలిదండ్రులతో కమిట్‌మెంట్సున్నాయి. అవి తీర్చుకుందుకు ముందుగా ఓ ఐదు లక్షలు కావాలి. అవి నీవు సద్దగలిగితే తర్వాత మనంమనం చూసుకుందాం” అన్నాడు. జీతం తనకివ్వకపోతే ముందు కట్నమిమ్మంటున్నాడని అర్థమైంది కవితకు. అతడు డబ్బుమనిషనీ, పెళ్ళయ్యేక అసలు రంగు మరికాస్త బయటపడుతుందనీ అనుకుని అతణ్ణి దూరంగా ఉంచిందామె.

ఆమెను ఇష్టపడ్డ మరో యువకుడు రామచంద్ర సినిమా హీరోలా ఉంటాడు. అతడి అందం చూసి డబ్బు, హోదా ఉన్న లావణ్య అనే అమ్మాయి వెంటబడింది. కొన్నాళ్ళామెతో స్నేహంచేసిన రామచంద్రకు కవితను చూడగానే తొలి చూపులోనే ప్రేమ పుట్టింది. అతడామెను కలుసుకుని- తనకు డబ్బు, హోదాకంటే రూపలావణ్యాలే ముఖ్యమనీ- కవిత తనకు సరైన జోడు అవుతుందనీ చెప్పి ఆమెను పెళ్ళిచేసుకుంటానన్నాడు. అతడి గురించి తెలుసుకుందుకు కవిత లావణ్యను కలుసుకుంది. ఆమె కవితతో, "నాకతడంటే ఎంతిష్టమో చెప్పలేను. కావాలనుకుంటే అతడది అవకాశంగా తీసుకుని నన్ను మోసం చేయొచ్చు. కానీ అతడి సంస్కారం గొప్పది. ఏడాదిపాటు కలిసి తిరిగినా మామధ్య స్నేహం మినహా మరేంలేదు. నేనతడికి నచ్చలేదు. అది నా దురదృష్టం. నువ్వతడికి నచ్చావ్. అది నీ అదృష్టం" అని నిట్టూర్చింది.

ఆ మాటల్లో లావణ్య అతడినెంతగా ప్రేమిస్తున్నదీ కవితకు అర్థమైంది. ఆ ప్రేమనుకాదని కేవలం రూపలావణ్యాలకోసం తనేమిటోకూడా తెలుసుకోకుండా తొలి చూపులోనే ప్రేమించానంటున్న రామచంద్ర- తనకు తగిన వరుడని ఆమెకు అనిపించలేదు. శాశ్వతం కాని అందచందాలకు ప్రాధాన్యమిచ్చేవాడు భార్యను సుఖపెట్టగలడని ఆమెకు తోచలేదు. అదీకాక ప్రేమంటే సాన్నిహిత్యంతో ఏర్పడేదనీ, చాలామంది వయసు ఆకర్షణని ప్రేమగా భ్రమిస్తారనీ, రామచంద్ర ప్రేమ అటువంటిదేననీ ఆమెకు అనిపించింది. ఫలితంగా ఈటస్ట్రీట్‌లో మరో యువకుడికి నిరుత్సాహం ఎదురైంది.

ఈటస్ట్రీట్‌లో ఆమెచే నిరాకరించబడిన మరికొందరికి కులం, మతం- వగైరాలు కలవలేదు. ఈ ఇరవయ్యొకటో శతాబ్దంలో అవో పెద్ద అభ్యంతరం కాకూడదు కానీ- ప్రేమా దోమా లాంటివేం లేకుండా అలాంటి పని చేసి తలిదండ్రులనిబ్బంది పెట్టడం ఆమెకిష్టం లేదు. తన పెళ్ళి విషయంలో ముందుగా పెద్దలకో అవకాశమివ్వాలనుకుందామె. అప్పుడామెకు ఆహ్లాద్ స్ఫురించాడు.

ఆహ్లాద్ తనకి స్వయానా బావ. అతడికి తనంటే చిన్నప్పట్నించీ అభిమానం. తనకీ అతడు బాగా తెలుసు. మనిషి మంచివాడు. పటాటోపం కాస్త ఎక్కువైనా- తన కాళ్ళమీద తను నిలబడింది కాబట్టి అతణ్ణి వంచడం పెద్ద కష్టం కాదు. ఎటొచ్చీ అతడి షరతుకాదని ఉద్యోగంలో చేరింది తను. ఐతే ఇంతవరకూ తన విషయంలో ఎప్పటికప్పుడు దిగి వస్తూనే ఉన్నారు వాళ్ళు. అతడింకా పెళ్ళిచేసుకోలేదు కాబట్టి- తనొప్పుకుంటే ఇప్పుడూ దిగి రావచ్చనుకుందామె.

తను ఉద్యోగంలో కొనసాగడానికి అభ్యంతరం లేకపోతే ఆహ్లాద్‌ని పెళ్ళిచేసుకుందుకు సిద్ధంగానే ఉన్నట్లు తల్లికి సూచించింది కవిత. కూతురికీ బావంటే ఇష్టమేనని గ్రహించిన కవిత తల్లి- ఉత్సాహపడి- తన అన్నకి నచ్చే పద్ధతిలో విషయం చెప్పింది.

చిన్నప్పట్నించీ కవిత వ్యక్తిత్వం తెలిసిన ఆహ్లాద్ కుటుంబ సభ్యులు కూడా ఆమెను వదులుకుందుకు సిద్ధంగాలేరు. ఒకటిరెండేళ్ళు ఉద్యోగంచేస్తే ప్రపంచం తెలిసొచ్చి, అందులో ఆడపిల్లకుండే సాధక బాధకాలు తెలిసి పెళ్ళికి సుముఖురాలౌతుందని వారి ఊహ. కవిత మంచమ్మాయనీ, ఇంటి పట్టున ఉంటే భర్తను సుఖపెట్టి, వంశానికి పేరు తెస్తుందనీ వారి ఆశ. ఆమె ఉద్యోగం చేసినా ఎవర్నో ప్రేమించి కాని పని చేయదని వారి నమ్మకం. ఇప్పుడా ఊహ, ఆశ, నమ్మకం నిజమైనట్లు తోచగా ఆ ఇంట్లో పెద్దలు బంతిని ఆహ్లాద్ కోర్టులోకి నెట్టారు.

ఆహ్లాద్ కూడా అందుకు సిద్ధంగానే ఉన్నాడు. "కవితకు నేనంటే ఇష్టం. అదంటే నాకూ ఇష్టం. నేను దాన్ని ఉద్యోగం చేయొద్దంటాను. అది ఉద్యోగం మాననంటుంది. ఇక ఈ విషయం మేమిద్దరం ముఖాముఖీ మాట్లాడి తేల్చుకోవాల్సిన సమయమొచ్చింది. కవితను నాకు అనుకూలంగా మార్చుకోగలనని నా నమ్మకం" అన్నాడతను. ఇరుపక్షాల పెద్దల దీవెనలందుకున్న ఆహ్లాద్ ఉత్సాహంగా, నమ్మకంగా కవితకు ఫోన్ చేసాడు. ఫలితంగా కవితకు మరో ఈటస్ట్రీట్ సమావేశం!

ముందు ఆహ్లాద్ తన వెంటపడుతున్న ఆడపిల్లల వివరాలిచ్చి, "వాళ్ళందర్నీ కాదనడానిక్కారణం నీమీద నాకున్న ప్రేమ. అర్థం చేసుకుంటావని చెబుతున్నాను" అన్నాడు.

కవిత వెంటనే తనవెంటబడ్డ యువకుల వివరాలిచ్చి, "నాకు నచ్చే వ్యక్తిత్వం లేదని వాళ్లను కాదన్నాను. పెళ్ళికి ప్రేమకంటే వ్యక్తిత్వం ముఖ్యం. అర్థం చేసుకుంటావని చెబుతున్నాను" అంది.

దెబ్బతిన్న ఆహ్లాద్ ఆమెనెలాగైనా దెబ్బతీయాలని, "నా ప్రేమకు కారణం మన సాన్నిహిత్యమే తప్ప నీ అందచందాలు కావు. ఆ ప్రేమతోనే నాకిష్టం లేకపోయినా ఇంజనీరింగ్ చదవనిచ్చాను. వేలకువేలు సంపాదించి నా చేతిలో పోస్తావని తెలిసీ ఉద్యోగం చేయొద్దంటున్నానంటే నాకు డబ్బాశ ఏమాత్రం లేదని అర్థం. ఇప్పటికైనా నా గొప్పతనం నీకు తెలిసుండాలి" అన్నాడు అతిశయంగా.

"నువ్వు ఇంజనీరు కావాలని నా కోరిక. ఎప్పుడైనా నీకు చెప్పానా? నీ చదువు నీ ఇష్టం- అనుకున్నాను. బీకాంలో చేరితే ఏమీ అనలేదు. నువ్వేమో ప్రతిసారీ నా విషయంలో కలగజేసుకుంటున్నావు. నా ఇష్టానికి వ్యతిరేకంగా షరతులు పెడుతున్నావు. అది గొప్పతనమని నేననుకోను" అంది కవిత వెంటనే.

ఏమనాలో తెలియక, "నేనింజనీరు కావాలని మనసులో అనుకుంటే ఎలా తెలుస్తుంది? ఒక్కసారి బైటకి అనుంటే నీ కోరిక తీర్చేవాణ్ణేమో" అన్నాడు ఆహ్లాద్.

దొరికావులే అనుకుంది కవిత మనసులో, "అదే నిజమైతే నా మనసులో ఇప్పుడో మాటుంది. బైటకి చెబితే పాటిస్తావా?" అంది.

"అది నాకు తెలుసు. నిన్నుద్యోగం మానమని చెప్పొద్దంటావ్!" నవ్వాడు ఆహ్లాద్.

"కాదు. నువ్వుద్యోగం మానేసి ఇంట్లో కూర్చోవాలనుంది నాకు. సమ్మతమేనా?" అంది కవిత. ఆహ్లాద్ తెల్లబోయి, "ఇదేం కోరిక?" అన్నాడు.

"ఏమో- మనసులో మాట చెప్పమన్నావ్, చెప్పాను. తర్వాత నీ ఇష్టం."

"నేనుద్యోగం చేయకుండా ఇంట్లో ఎలా గడుస్తుంది? నాన్న రిటైరైపోతారు. మాకు ఉద్యోగం తప్ప వేరే ఆస్తులు లేవు" అన్నాడు ఆహ్లాద్ చిరాగ్గా.

"ఐతే ఏం- నా ఉద్యోగముందిగా? పెళ్ళయ్యేక నిన్నూ, అత్తనీ, మామయ్యనీ నేను పోషిస్తాను" అంది కవిత తాపీగా.

ఆహ్లాద్ ముఖం ఎర్రబడింది. "అంటే పెళ్ళయ్యేక నేను చేతకానివాడిలా ఇంట్లో కూర్చుని నీ సంపాదన తినాలంటావ్!" అన్నాడు.

"అంటే పెళ్ళయ్యేక ఇంట్లో కూర్చుని నీ సంపాదన తింటే నేను చేతకానిదాన్నని నీ అభిప్రాయం. ఔనా?" అంది కవిత వెంటనే.

స్వాభిమానమున్న ఓ ఆధునిక యువతితో మాట్లాడుతున్నానని అప్పటికి స్ఫురించిన ఆహ్లాద్‌కి కాసేపు నోట మాట రాలేదు. నెమ్మదిగా తేరుకుని, "చేతకానిదానివని నిన్నంటే మా అమ్మను కూడా అవమానించినట్లే కదా! గృహిణిగా ఇంట్లో ఉంటూ ఆడది చేయగల అద్భుతాలు మగాడికి అసాధ్యం. ఇంటి పనుల విషయంలో మగాడి చేతకానితనం మా ఇంట్లోనే ఎన్నోమార్లు ఋజువైంది. ముఖ్యంగా పిల్లల పెంపకంలో" అన్నాడు.

కవిత అతణ్ణదోలా చూసి, "ఒకప్పుడు ఆడది గడప దాటితే ఎందుకూ పనికి రాదంటూ ఆమెను వంటింటి కుందేల్ని చేసారు. అందుకామె పౌరుషపడి గడప దాటి తనేమిటో నిరూపించుకుంటోంది. నేనదే చేస్తున్నాను. నువ్వూ అలాగే పౌరుషపడి ఇంట్లో నువ్వేమిటో నిరూపించుకునే ప్రయత్నం చేయాలి కానీ- ఇదేమిటీ చేతకానివాణ్ణని నిర్మొహమాటంగా చెప్పుకుంటున్నావ్?" అంది.

ఈ ప్రశ్నకి ఆహ్లాద్‌వద్ద సమాధానం లేదు.

కవితే మళ్ళీ, "స్త్రీని ఆదిపరాశక్తి అని అందలమెక్కించారు. మాతృదేవోభవ అంటూ గౌరవ స్థానంలో ప్రథమ తాంబూలమిచ్చారు. కలకంఠి కంట కన్నీరొలికిన అనర్థమంటూ ఆమెకు రక్షణ కల్పించారు. ఎన్ని చేసినా గడప దాటి తనేమిటో నిరూపించుకునేదాకా తనకు లభించే గౌరవం అసలైనది కాదని గ్రహించడానికి ఆడదానికి ఇన్నేళ్ళు పట్టింది" అంటూ ఇక చెప్పాల్సిందేలేదన్నట్లు అతడివంక చూసింది.

"నా గురించి తప్పుగా అనుకుంటున్నావ్ కవితా! నువ్వు ఇన్ఫోసిస్ నారాయణమూర్తి భార్య సుధ గురించి వినే ఉంటావ్. జ్ఞానంలో, పరిజ్ఞానంలో భర్తకేమాత్రమూ తీసిపోని ఆమె- తామిద్దరిలో ఒకరు ఇంటి బాధ్యతలు తీసుకోక తప్పదనుకున్నప్పుడు- తాను గృహిణిగా మిగిలిపోవాలనుకుందే తప్ప నీకులా అనలేదు. నేను నిన్నుద్యోగం చేయొద్దంటున్నది ఆమె ప్రేరణతోనే!" అన్నాడు ఆహ్లాద్.

"ఆహ్లాద్ బావా! నారాయణమూర్తి సుధని పెళ్ళికి ముందు శాసించలేదు. పెళ్ళయ్యేక వారిద్దరూ కలిసి సమిష్టిగా సామరస్యంతో తీసుకున్న నిర్ణయమది. ఆ నిర్ణయం ప్రేరణ ఐతే నీ పేరులో నాకు స్ఫురించేది అహం మాత్రమే. ఆమె వ్యక్తిత్వం ప్రేరణఅయ్యే స్థాయికి నువ్వెదిగితే నాకు నిజంగా నీ పేర్లో ఆహ్లాదం స్ఫురిస్తుంది. నువ్వాస్థాయికి ఎదిగేలోగా ఆ స్థాయి వ్యక్తి నాకు తటస్థపడకపోతే- మరోసారి పెళ్ళి ప్రపోజల్‌తో నా దగ్గిరకి రావచ్చు" అంటూ సన్నగా అర నవ్వు నవ్వి లేచింది కవిత.

ఆ సన్నని అరనవ్వుకి అర్థం తెలిసిన ఆహ్లాద్ మతి తప్పి మంచాన పడితే- అందుకు రొమాంటిక్ కారణాలు వెతికే అబ్బాయిలు మారాలి. ఎందుకంటే అమ్మాయిలు మారుతున్నారు. వారి నవ్వులకూ అర్థాలు మారుతున్నాయి.

★


రచయిత్రి చిరునామా:

జి.రామలక్ష్మి

శ్రీవాణి గిరిజా నిలయం, 68 సాకేత్‌ఫేజ్ 1,

కాప్రా, ఇసిఐఎల్ పోస్ట్, హైదరాబాద్- 500 062.